batukammanews.com
TEL/2019/78873

# బతుకమ్మ

తాజా వార్తల సద్దిమూట

11 సెప్టెంబర్ 2026
శుక్రవారం

## సీఎంఆర్ఎఫ్ మెడికల్ రీయెంబర్స్‌మెంట్ కోసం లక్ష లంచం

### సచివాలయంలో ఏసీబీ దాడుల కలకలం

లంచం తీసుకుంటూ డాటా ఎంట్రీ ఆపరేటర్, సీనియర్ అసిస్టెంట్ పట్టివేత ..



2 లో

### కేటీఆర్, హరీష్ రావు పై లైంగిక వేధింపుల కేసులు

## కాంగ్రెస్ కక్ష సాధింపులు

### ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి

హైదరాబాద్, బతుకమ్మ : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ , బీఆర్ఎస్ పక్ష ఉపనేత హరీష్ రావు పై అక్రమంగా బనాయించిన లైంగిక వేధింపుల కేసులు కాంగ్రెస్ కక్ష సాధింపుల లో భాగమని-బీ ఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు.



2 లో

### ఎస్సారెస్పీలో నీళ్లున్నా

## రైతుల పంటలు ఎండుతున్నాయి

### మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి

హైదరాబాద్, బతుకమ్మ : శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ లో ప్రస్తుతం 46 టీఎంసీల నీరు అందుబాటులో ఉన్నా జిల్లా రైతుల పంటలు ఎండిపోతున్నాయని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు.తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి రాష్ట్రంలోని రైతాంగ సమస్యలు, నిజామాబాద్ జిల్లాలో ఎండిపోతున్న పంటలు, సాగునీటి విడుదల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు.



2 లో

# రైసు మిల్లర్ల నిరసనను లైట్‌గా తీసుకున్న ప్రభుత్వం

## సీఎంఆర్ విషయంలో పట్టువిడవని సర్కార్

### అసోసియేషన్ బెదిరింపులను పట్టించుకోని యంత్రాంగం



2 లో

నిజామాబాద్, బతుకమ్మ : తెలంగాణ రాష్ట్రంలో అత్యధికంగా రైతులు సాగు చేసే వరి పంటను ధాన్యం నుర్పిడి చేసే మిల్లర్లు చేస్తున్న నిరసనను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం తమ సమస్యలు పట్టించుకోవాలని, డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మిల్లర్లు 48 గంటలుగా మిల్లింగ్ ను నిలిపివేసిన సర్కార్ నుంచి ఆశించిన స్పందన కనిపించడంలేదు. ఎందుకంటే గత ప్రభుత్వం నుంచి ప్రజాప్రభుత్వం వరకు మిల్లర్లకు కేటాయించిన ధాన్యంను మిల్లింగ్ చేసి ఇవ్వాల్సిన బియ్యంను ఇవ్వకపోవడమే కారణంగా కనిపిస్తుంది. తెలంగాణలో ప్రతి సీజన్ లో రైసుమిల్లులకు ధాన్యం కేటాయింపులు చేయడం ఆనవాయితీగా వస్తుంది. ప్రభుత్వం ఇచ్చే కమిషన్ తో పాటు నూకలు, తౌడు, ఊక ను సొమ్ము చేసుకోవడం అనేది సాంప్రదాయంగా వస్తుంది. అయితే గత ప్రభుత్వ హయంలో మిల్లర్లు సీఎంఆర్ కోసం కేటాయించిన ధాన్యంను మిల్లింగ్ చేసి ఎఫ్ సిఐకి అప్పగించకుండానే టన్నుల కొద్ది వడ్లను అమ్ముకున్నారన్న అపకీర్తి ఉంది. ఈ వ్యవహారంలో కోట్ల రూపాయల ధాన్యం పక్కదారి పట్టినట్లు విజిలెన్స్ ల తనిఖీల్లో తేలింది. అదే సమయంలో విజిలెన్స్ అధికారులు, ఏకంగా కమిషనరేట్ లోని అధికారులు కోట్ల రూపాయల మామూళ్లు తీసుకుని మిల్లర్లను కాపాడారనే విమర్శలు లేకపోలేదు. గత ప్రభుత్వ హయంలోనూ గత రెండేళ్లలోనూ చాలా మంది మిల్లర్లు సీఎంఆర్ ఇవ్వకపోయినా ధాన్యం కేటాయింపులు జరుగడంతో ప్రభుత్వం సీరియస్ గా వ్యవహరించి అందుకు బాధ్యులైన అప్పటి కమిషనర్ తో పాటు విజిలెన్స్ విభాగంలోని అధికారులపై వేటు వేశారు. అది చాలదని జిల్లాల వారీగా సివిల్ సప్లయ్ అధికారులతో పాటు, సివిల్ సప్లయ్ మేనేజర్ స్థాయి అధికారులపై కఠిన చర్యలకు ఉపక్రమించారు. అయితే అప్పటికే జరుగాల్సిన నష్టం జరిగిపోవడంతో సర్కార్ సీఎంఆర్ ఎగవేతదారులపై కఠిన చర్యలకు సిద్ధమైంది.



2 లో

### సీఎంకు సికింద్రాబాద్

## గణేష్ దేవాలయ కమిటీ ఆహ్వానం

హైదరాబాద్, బతుకమ్మ : గణపతి నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనాల్సిందిగా సికింద్రాబాద్ శ్రీ గణేష్ దేవాలయ కమిటీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని ఆహ్వానించింది. గురువారం అసెంబ్లీలోని ఛాంబర్‌లో ముఖ్యమంత్రిని దేవాదాయ శాఖ కమిషనర్, శ్రీ గణేష్ దేవాలయ కమిటీ అర్చకులు కలిసి ఆహ్వానాన్ని అందించారు. ఈ సందర్భంగా మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో పాటు పలువురు శాసనసభ్యులు ఉన్నారు.

## అడవిలో తప్పిపోయిన వ్యక్తిని డ్రోన్ కెమెరాల సహాయంతో గుర్తించిన పోలీసులు



2 లో

### విజయవంతమైన రెస్క్యూ ఆపరేషన్

### పోలీసు సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ డి.జానకి

మహబూబ్ నగర్, బతుకమ్మ : మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ మండలం ఆచార్యపూర్ గ్రామానికి చెందిన జాజలి కృష్ణయ్య ఈ నెల 8న ఉదయం మేకలను మేపేందుకు గ్రామ శివారులోని అటవీ ప్రాంతానికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో, కృష్ణయ్య తల్లి జాజలి మంగమ్మ ఫిర్యాదు మేరకు 9న కోయిలకొండ పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ డి.జానకి వెంటనే స్పందించి, తప్పిపోయిన వ్యక్తి ఆచూకీ కోసం అన్ని రకాల వనరులను వినియోగిస్తూ ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

బతుకమ్మ

11 సెప్టెంబర్ 2026 శుక్రవారం

# అడవిలో తప్పిపోయిన వ్యక్తిని డ్రోన్ కెమెరాల సహాయంతో గుర్తించిన పోలీసులు



ప్రత్యేక పోలీసు బృందాలు, ఏఆర్ స్పెషల్ పార్టీ సిబ్బంది సమన్వయంతో దట్టమైన అటవీ ప్రాంతంలో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. అటవీ ప్రాంతం విస్తీర్ణం, కొండలు, లోయలు, ప్రమాదకర ప్రాంతాలను దృష్టిలో ఉంచుకుని డ్రోన్ కెమెరాల సహాయంతో కూడా ప్రత్యేకంగా గాలింపు చేపట్టారు. గాలింపు చర్యల్లో భాగంగా కృష్ణయ్య మేకలను మేపుతూ ఒక పెద్ద కొండపైకి వెళ్లిన సమయంలో ప్రమాదవశాత్తు కాలు జారి కొండ చరియల మధ్యలోని లోయ ప్రాంతంలో చిక్కుకుపోయినట్లు డ్రోన్ కెమెరాల ద్వారా అతని ఆచూకీని ఖచ్చితంగా గుర్తించిన పోలీసులు వెంటనే ఆ ప్రాంతానికి చేరుకుని, ప్రత్యేక రెస్క్యూ చర్యలు చేపట్టి కృష్ణయ్యను సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. కొండ చరియల మధ్య చిక్కుకుపోయిన కృష్ణయ్య రెండు రోజుల పాటు తన వెంట తీసుకెళ్లిన నీటిని తాగుతూ అక్కడే ఉండి ప్రాణాలు కాపాడుకున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. సకాలంలో డ్రోన్ కెమెరాల సహాయంతో అతని ఆచూకీ గుర్తించి, ప్రత్యేక బృందాలు చేపట్టిన సమన్వయంతో కూడిన రెస్క్యూ ఆపరేషన్ ద్వారా కృష్ణయ్యను సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ రెస్క్యూ ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేసిన పోలీసు అధికారులు, సిబ్బంది, ప్రత్యేక పోలీసు బృందాలు, ఏఆర్ స్పెషల్ పార్టీ సిబ్బంది , డ్రోన్ ఆపరేటర్లను జిల్లా ఎస్పీ డి.జానకి అభినందించారు. ఆపదలో ఉన్న వ్యక్తి ప్రాణాలను కాపాడేందుకు సమన్వయంతో, నిరంతరంగా శ్రమించిన పోలీసు సిబ్బంది సేవలను ఎస్పీ ప్రశంసించారు. తమ కుటుంబ సభ్యుడి ఆచూకీని గుర్తించి, సురక్షితంగా తమకు అప్పగించిన జిల్లా ఎస్పీకి పోలీసు బృందాలకు కృష్ణయ్య కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఎస్సారెస్పీలో నీళ్లున్నా రైతుల పంటలు ఎండుతున్నాయి

వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావంతో నిజామాబాద్ జిల్లాలో చెరువులు, బోర్లు ఎండిపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పంటలు ఎండిపోయే దశకు చేరుకున్నప్పటికీ ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. గుత్ప లిఫ్ట్ ఇరిగేష న్‌కు మొత్తం 540 క్యూసెక్కుల డిశ్చార్జ్ సామర్థ్యం ఉందని, నాలుగు మోటార్ల ద్వారా ఈ నీటిని విడుదల చేయవచ్చని తెలిపారు. అయితే ప్రస్తుతం ప్రభుత్వం కేవలం ఒక మోటారు మాత్రమే నడుపుతూ 135 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తోందని అన్నారు. నాలు గు మోటార్లను పూర్తి సామర్థ్యంతో నడిపితే నిజామా బాద్ రూరల్, ఆర్మూర్, బాల్కొండ నియోజక వర్గాల పరిధిలోని వందలాది చెరువులను నింపి రైతుల పంటలను కాపాడవచ్చని తెలిపారు అలీసాగర్ లిఫ్ట్ ఇరిగేషన్‌కు 720 క్యూసెక్కుల సామర్థ్యం ఉందని, నాలుగు మోటార్లను పూర్తి స్థాయిలో నడపాల్సి ఉండగా ప్రస్తుతం సగం మోటార్లను మాత్రమే ఆన్--ఆఫ్ పద్ధతిలో నడుపుతున్నారని విమర్శించారు.నాలుగు మో టార్లను నిరంతరాయంగా నడిపితే బోధన్, నిజామాబా ద్ రూరల్, బాన్సువాడ ప్రాంతాల్లోని చెరువులకు నీరు అందించి పంటలను కాపాడవచ్చని తెలిపారు. గుత్ప, అలీసాగర్ లిఫ్టులను కలిపి రోజుకు 1,260 క్యూసెక్కుల చొప్పున నెలరోజులు నడిపినా సుమారు 3 నుంచి 3.5 టీఎంసీల నీరు మాత్రమే వినియోగమవుతుందని వివరించారు. బాల్కొండ నియోజకవర్గ పరిధిలోని లక్ష్మీ కెనాల్‌కు 330 క్యూసెక్కుల సామర్థ్యం ఉందని, దీని ద్వారా సుమారు 28,000 నుంచి 30,000 ఎకరాల ఆయకట్టుకు నీరు అందించడంతో పాటు చెరువులను నింపే అవకాశం ఉందని తెలిపారు. చౌట్‌పల్లి హన్మంత్రెడ్డి లిఫ్ట్ ద్వారా 160 క్యూసెక్కుల నీటిని విడుదల చేసి 60--70 చెరువులను నింపవచ్చని తెలిపారు.

# ఆల్ప్రాజోలం దందా చేసే వారి రూ.3.02 కోట్ల ఆస్తుల జప్తు

నిజామాబాద్ క్రైం, బతుకమ్మ: నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నిషేదిత మత్తు పదార్థమైన ఆల్ప్రాజోలం తయారి, రవాణా, సరఫరా చేస్తున్న వ్యక్తుల సంబంధిత ఆస్తులను జప్తు చేసినట్లు నిజామాబాద్ పోలీసు కమిషనర్ సాయిచైతన్య తెలిపారు. నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆల్ప్రాజోలం రవాణాకు సంబంధించిన 2020లో నమోదైన కేసుల విషయంలో రాజస్థాన్ నుంచి ఆల్ప్రాజోలంను రవాణా విక్రయాలు చేసిన వ్యక్తులకు సంబంధించిన రెండు కార్లు, మొబైల్ ఫోన్లు, 3.50 లక్షల నగదును ఆనాడు సీజ్ చేసినట్లు తెలిపారు. ఆల్ప్రాజోలంను కిలోకు రూ.4 లక్షల నుంచి 5 లక్షల వరకు విక్రయిస్తున్నట్లు విచారణలో ఈ దందాలో అక్రమంగా సంపాదించిన ఆస్తులను గుర్తించినట్లు తెలిపారు. నిషేద మత్తుపదార్థాల అక్రమ రవాణా, సరఫరా చేసిన నిజామాబాద్, నిర్మల్, మహబూబ్ నగర్ జిల్లాల పరిధిలో ఆస్తులు కూడబెట్టిన గంధం శ్రీనివాస్ గౌడ్, బొట్ల కాటమయ్యగౌడ్ లు 3.02 కోట్ల ఆస్తులను సంపాదించినట్లు గుర్తించి వాటిని జప్తు చేసినట్లు తెలిపారు. డ్రగ్స్ అక్రమ రవాణా , అక్రమ నిల్వ , విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 112 కు సమాచారం అందించాలని కోరారు. అక్రమంగా నిషేదిత మత్తుపదార్థాలను రవాణా, సరఫరా చేసిన వ్యక్తులను గుర్తించి సీజ్ చేయడానికి కారకులైన రూరల్ పోలీసులను సీపీ సాయిచైతన్య అభినందించారు.

## గంజాయి రవాణా చేస్తున్న

# ఇద్దరిని అరెస్టు చేసిన పోలీసులు




నిజామాబాద్ క్రైం, బతుకమ్మ :మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి నిజామాబాద్ కు గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు 6వ టౌన్ ఎస్ హెచ్ వో సందీప్ తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జన్నేపల్లి రైల్వేగేట్ వద్ద గురువారం వాహనాలు తనిఖీలు నిర్వహిస్తుండగా ఓ కారు అనుమానాస్పద స్థితిలో ఉన్న ఇద్దరు వ్యక్తులను పట్టుకుని విచారించగా వారి వద్ద నాలుగు కిలోల గంజాయి లభించిందని తెలిపారు. నాందేడ్ కు చెందిన ఆకుల్ వార్ రాజేందర్, సద్దాంల వద్ద నాలుగు కిలోల గంజాయి దొరికిందని తె లిపారు. ఉత్తర్ ప్రదేశ్ లోని శంషాద్ నుంచి గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి నిజామాబాద్ లో విక్రయించేందుకు వస్తుండగా పట్టుబడినట్లు విచారణలో తేలింది. వారి వద్ద నుంచి కారు, నాలుగు కిలోల గంజాయి, రెండు సెల్ ఫోన్లు సీజ్ చేసినట్లు తెలిపారు. గంజాయి విలువ సుమారు రెండు లక్షల వరకు ఉంటుందన్నారు. గంజాయి విక్రేతలను పట్టుకోవడంలో పోలీస్ స్టేషన్ 2వ ఎస్సై నారాయణ సింగ్ , సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

# రైసుమిల్లర్ల నిరసనను లైట్‌గా తీసుకున్న ప్రభుత్వం

గతంలోనూ కస్టమ్ మిల్లింగ్ రైస్ ను ఎఫ్ సిఐకి అప్పగించని మిల్లర్లపై కేసులతో పాటు రెవెన్యూ రికవరి యాక్టుకు సిద్ధమైంది. క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో మిల్లర్లు బెంబేలెత్తిపోయారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం మొత్తం మిల్లర్లకు కేటాయించిన వడ్ల లెక్కలను తేలుస్తూ ఎగవేతదారులపై కఠిన చర్యలకు సిద్ధమైంది. ఈ విషయం రైసుమిల్లులకు ఏమాత్రం రుచించలేదు. ప్రధానంగా నల్గొండ, కరీంనగర్, వరంగల్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలకు చెందిన రైసుమిల్లులలో కోట్ల రూపాయల బకాయిలు ఉండడంతో కఠిన చర్యలకు దిగింది. దానితో అసోసియేషన్ మాటున మిల్లర్లు ప్రభుత్వానికి తమ సమస్యలు పరిష్కరించాలన్న సాకుకు సిద్ధమయ్యారు. సామర్థ్యం లేని మిల్లులకు టన్నులకొద్ది ధాన్యం కేటాయించడమే కాకుండా వాటిని నూర్పిడి చేయకుండా ఏళ్ళకొద్ది ప్రభుత్వానికి ముఖ్యంగా ఎఫ్ సిఐకి బియ్యం అప్పగించకుండానే ఉన్న మిల్లర్లపై చర్యలకు సిద్ధం కావడం అందులో బడాబడా రైసుమిల్లర్లు ఉండడంతో అసోసియేషన్ ముసుగులో ప్రభుత్వానికి ఇరుకున పెట్టేందుకు సిద్ధమయ్యారు. ఈ విషయంలోనే రెండు రోజులుగా సాధారణ రైసుమిల్లులపై తనిఖీలు ఎందుకని మిల్లింగ్ బంద్ అని డ్రామాకు తెరదీశారు. అయితే ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి రైసుమిల్లర్ల నిరసన నుంచి ఎలాంటి స్పందన లభించలేదు. ఇప్పటికే క్రిమినల్ కేసులు నమోదు చేసినా మిల్లర్ల నుంచి కచ్చితంగా రికవరి జరుగాలని ఆదేశాలు ఉండడంతో రైసుమిల్లర్లకు మింగుడు పడడం లేదు. కొందరు ప్రజాప్రతినిధులతో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నాలు విఫలం కావడంతోనే తెలంగాణ ఏర్పడిన తర్వాత తొలిసారి మిల్లింగ్ బంద్ అనే కొత్త నాటకానికి తెరదీశారనే చర్చ జరుగుతుంది. బడాబడా రైసుమిల్లర్లు కోట్ల రూపాయల ధాన్యంను బహిరంగ మార్కెట్లో అమ్ముకుని నిర్ణీత గడువులోపల ఎఫ్ సిఐకి అప్పగించకుండా ప్రభుత్వాన్ని బద్నం చేసే ప్రక్రియ జరుగుతుందని అధికార పార్టీ గుర్తించి మిల్లర్ల డిమాండ్ కు తలొగ్గడం లేదని తెలిసింది. అత్యధికంగా వరి పండించే నల్గొండ, కరీంనగర్, నిజామాబాద్, వరంగల్ జిల్లాల్లో రెవెన్యూ రికవరి యాక్టులతో పాటు క్రిమినల్ కేసులు సిద్ధం చేశారని చర్చ జరుగుతుంది.

## కేటీఆర్, హరీష్ రావు పై లైంగిక వేధింపుల కేసులు కాంగ్రెస్ కక్ష సాధింపులు

ప్రజా సమస్యలను పట్టించుకోకుండా అసెంబ్లీ సమావేశాలను రేవంత్ రెడ్డి చెత్త రాజకీయ ఎత్తుగడలతో ప్రజాధనాన్ని పెద్ద ఎత్తున దుర్వినియోగం చేశారని ఆయన విమర్శించారు. ప్రజా సమస్యల ఊసు లేదని, కాంగ్రెస్ సొల్లు పురాణానికి హద్దు లేదని, అన్ని వర్గాల ప్రజలు ఎన్నో ఆశలతో అసెంబ్లీ వైపు హతాశులయ్యారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 22వేల ఎకరాల భూముల కుంభకోణం, రీయింబర్స్ మెంట్ బకాయిలు, లక్ష మంది పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసిన జీవో 97 వంటి కీలక అంశాలపై చర్చ జరగాల్సి ఉండగా ప్రభుత్వం పారిపోయిందన్నారు. నిజానికి శాసనసభను తప్పుదోవ పట్టించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సెషన్ పూర్తయ్యేంత వరకు అసెంబ్లీ నుంచి డిబార్ చేయాలని జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు.శాసనసభను దుర్యోధన, దుశ్వాసన సభగా మార్చిన కాంగ్రెస్ కు ప్రజలు కర్రుకాల్చి వాతలు పెట్టే రోజులు ఇంకెంతో దూరం లేవని ఆయన హెచ్చరించారు. ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేస్తున్న కాంగ్రెస్ నిరంకుశ దరహాసం చేస్తోందని ఆయన అన్నారు.తెలంగాణ జాతిపిత కేసీఆర్ ను టార్గెట్ చేస్తే పుట్ట గతులుండవని ఆయన హెచ్చరించారు.ఇకనైనా కుట్రలు ఆపి పాలనపై దృష్టి పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. బీ ఆర్ఎస్ నాయకులు కనపడగానే బూతులతో ' నోరు ' ఎత్తుడు కాదు, ప్రాజెక్టుల ' డోర్ ' ఎత్తు రేవంత్ అని, పంటలు ఎండిపోకుండా గట్టి చర్యలు తీసుకోవాలని జీవన్ రెడ్డి హితవు పలికారు

## సీఎంఆర్ఎఫ్ మెడికల్ రీయెంబర్స్ మెంట్ కోసం లక్ష లంచం

వెబ్ డెస్క్, బతుకమ్మ :తెలంగాణ సెక్రటేరియట్ లో సీఎం రిలీఫ్ ఫండ్, ఫీజు రీయెంబర్స్ మెంట్ కోసం లంచం తీసుకుంటూ ఉద్యోగులు అవినీతి నిరోధక శాఖకు చిక్కారు. మంగళవారం సీటీ రేంజ్ 2 ఏసీబీ రేంజ్ అధికారులు సెక్రటేరియట్ లో దాడులు నిర్వహించారు. లక్ష రూపాయల లంచం తీసుకుంటూ సచివాలయం ఔట్ సోర్సింగ్ ఉద్యోగి అందేశీ రాఘవేందర్, టీఎస్ఐడీసీ సీనియర్ అసిస్టెంట్ మేడి వినోద్ లను లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. రెవెన్యూ శాఖ పరిధిలోని ముఖ్యమంత్రి సహాయనిధి సెక్షన్ లో డాటా ఎంట్రీ ఆపరేటర్ గా పని చేస్తున్న అందేశీ రాఘవేందర్ బాధితుడికి సంబంధించిన రూ.2 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేసేందుకు రూ.లక్ష డిమాండ్ చేశారు. స్థానిక టీఎస్ఐడీసీ సీనియర్ అసిస్టెంట్ మేడి వినోద్ ఆదేశాల మేరకు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు

# బాన్సువాడ నియోజకవర్గ ప్రజలే నా కుటుంబం...

**ప్రజల సమస్యల పరిష్కారమే నా బాధ్యత..**
**ఎమ్మెల్యే పదవి హోదా కాదు :**
**పోచారం శ్రీనివాస్ రెడ్డి**
**ప్రజల కష్టమే నా కష్టం..**
**వారి అభివృద్ధే నా లక్ష్యం...**
**ప్రజల ఓట్లతో గెలిచా.. ప్రజలకు దూరంగా**
**ఉండను – పోచారం శ్రీనివాస్ రెడ్డి...**
**సార్.. సమస్య ఉంది అంటే చాలు..**
**ప్రజల కోసం ఎప్పుడూ అందుబాటులో...**
**పదవి కాదు.. ప్రజాసేవే పరమావధి**
**బాన్సువాడ ప్రజలే నా కుటుంబం..**

బాన్సువాడ బతుకమ్మ : బాన్సువాడ నియోజకవర్గ ప్రజలే తన కుటుంబమని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో ఉన్న తన భార్య, పిల్లలు, కోడళ్లు, మనవళ్లు, మనుమరాళ్లతో పాటు నియోజకవ ర్గంలోని ప్రతి కుటుంబాన్ని తన కుటుంబంగానే భావి స్తానని తెలిపారు.అత్యవసర పరిస్థితి ఉంటే తప్ప హైదరా బాద్ వెళ్లాలని అనిపించదని, అక్కడ కుటుంబ సభ్యులతో కొంత సమయం గడిపి తిరిగి బాన్సువాడకు వచ్చేస్తానని చెప్పారు. తన మనవళ్లు చిన్నప్పటి నుంచి తన దగ్గరే పెరి గారని, వారు గుర్తొస్తే వెళ్లి చూసి వస్తానని పేర్కొన్నారు. అయితే తన మనసు, ఆలోచన, బాధ్యత మొత్తం బాన్సువాడ ప్రజలతోనే ముడిపడి ఉందన్నారు.

### ప్రజల సమస్యలే తన బాధ్యత...

తాను బాన్సువాడలో ఉన్న సమయంలో ఏదో ఒక గ్రామం నుంచి ప్రజలు వచ్చి తమ సమస్యలను చెప్పుకుం టుంటారని పోచారం తెలిపారు. దవాఖానలో సమస్య, కుటుంబంలో ఆపద, పెన్షన్, ఇల్లు, సాగునీరు వంటి సమస్యలను ప్రజలు తన దృష్టికి తీసుకువస్తారని చెప్పారు. ప్రజలు సమస్యలు చెప్పుకోవడానికి తన వద్దకు రావడం తనకు ఇబ్బంది కాదని, అదే తన బాధ్యత, తన పని అని స్పష్టం చేశారు.ప్రజలు తనను ఎమ్మెల్యేగా ఎన్నుకున్నది కేవలం ఒక పదవి కోసం కాదని, వారి కష్టాల్లో అండగా నిలిచి సమస్యలకు పరిష్కారం చూపాలనే నమ్మకంతో తనకు అవకాశం ఇచ్చారని అన్నారు.

### భార్య ఆపరేషన్.. రైతులకు సాగునీరు...

కొన్ని రోజుల క్రితం తన భార్యకు కాలికి ఆపరేషన్ జరిగిన సమయంలోనూ రైతుల ప్రయోజనాల కోసం తీసుకున్న నిర్ణయాన్ని పోచారం గుర్తుచేశారు. అదే సమయంలో నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ఆయకట్టు రైతులకు సాగునీరు విడుదల చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.ఒకవైపు కుటుంబ సభ్యురాలికి ఆపరేషన్ జరుగుతుండగా, మరోవైపు వేలాది మంది రైతుల పంటలకు అవసరమైన సాగునీటిని విడుదల చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. డాక్టర్ అనుమతి తీసుకుని ఆపరేషన్ థియేటర్‌లోకి వెళ్లి భార్య ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న అనంతరం రైతులకు నీళ్లు విడుదల చేయాల్సిన బాధ్యతకు ప్రాధాన్యతనిస్తూ నిజాంసాగర్ ప్రాజెక్టు వద్దకు బయలుదేరినట్లు తెలిపారు.
ఒక రైతు పొలానికి నీరు ఆలస్యమైతే పంట నష్టపోయే అవకాశం ఉంటుందని, దాని ప్రభావం ఆ రైతు కుటుంబంపై పడుతుందని పేర్కొన్నారు.

### ఎమ్మెల్యే పదవి అలంకారం కాదు...

ఎమ్మెల్యే పదవి తనకు అలంకారం కాదని, ప్రజలు అప్పగించిన బాధ్యత అని పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ప్రజల ఓట్లతో గెలిచి ప్రజలకు దూరంగా ఉండే నాయకత్వం తనకు అవసరం లేదన్నారు.ప్రజల మధ్య ఉండటం, వారి సమస్యలను వినడం, కష్టాల్లో అండగా నిలవడం, అవసరాలకు స్పందించడం, ప్రజల కోసం సమయం కేటాయించడం ప్రజాప్రతినిధి బాధ్యత అని తెలిపారు.

### ప్రజల కష్టమే నా కష్టం...

బాన్సువాడ నియోజకవర్గ ప్రజలే తన కుటుంబమని, వారి కష్టమే తన కష్టమనీ పోచారం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజల సంతోషమే తన సంతోషమనీ, వారి అభివృద్దే తన లక్ష్యమని తెలిపారు.నాకు ఎమ్మెల్యే పదవి ఒక హోదా కాదు.. ప్రజలు నాకు అప్పగించిన పవిత్రమైన బాధ్యత అని పోచారం స్పష్టం చేశారు.

# గోదావరి పుష్కరాలకు విస్తృత స్థాయిలో ఏర్పాట్లు

**ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి వెల్లడి**
**కందకుర్తి, యంచ పుష్కర ఘాట్ల వద్ద అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు**
**పాల్గొన్న కలెక్టర్, ప్రజాప్రతినిధులు**





నిజామాబాద్, బతుకమ్మ : త్రివేణి సంగమ ప్రాంతం అయిన రెంజల్ మండలం కందకుర్తి వద్ద, నవీపేట మండలం యంచ వద్ద గోదావరి పుష్కర ఘాట్ల నిర్మాణాలు,ఇతర అభివృద్ధి పనులకు గురువారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ భవేష్ మిశ్రా శంకుస్థాపనలు చేశారు. కందకుర్తి వద్ద నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో రూ. 6.05 కోట్ల అంచనా వ్యయంతో పుష్కర ఘాట్ నిర్మాణానికి , పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో రూ.3.90 కోట్ల నిధులతో రోడ్ల నిర్మాణాలకు, దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో రూ. 5.00 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి శంకుస్థాపనలు చేశారు. అదేవిధంగా యంచ వద్ద రూ. 2.15 కోట్ల నిధులతో పుష్కర ఘాట్, రూ. 70 లక్షలతో రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ గోదావరి పుష్కరాలను కుంభమేళా తరహాలో అట్టహాసంగా నిర్వహించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెద్ద ఎత్తున నిధులు కేటాయిసున్నారని అన్నారు. ఒక్క కందకుర్తి పుష్కర క్షేత్రం వద్దనే అన్ని శాఖల పనులను కలుపుకుని సుమారు 30 కోట్ల రూపాయలను వెచ్చిస్తున్నామని వివరించారు. భక్తుల రాకపోకలు, పార్కింగ్, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, వైద్య సేవలు, దుస్తులు మార్చుకునే గదులు తదితర సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. భక్తులకు అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా, సురక్షితమైన వాతావరణం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల మౌలిక వసతులు, సౌకర్యాలు కల్పించేందుకు విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేపడుతున్నట్లు ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి తెలిపారు. వచ్చే ఏడాది జూన్,జూలై మాసాలలో జరిగే గోదావరి పుష్కరాల సందర్భంగా పుణ్య స్నానాల కోసం జిల్లాలోని వివిధ పుష్కర క్షేత్రాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున పుష్కర ఘాట్ల వద్ద సదుపాయాల కల్పన కోసం అవసరమైన అభివృద్ధి పనులు చేపడుతున్నామని అన్నారు. కాగాపనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ భవేష్ మిశ్రా సంబంధిత అధికారులను ఆదేశించారు. పుష్కర ఘాట్ల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పుణ్య స్నానాల కోసం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పుష్కరాలను విజయవంతంగా నిర్వహించేందుకు సమగ్ర కార్యాచరణతో ముందుకెళ్లాలని అన్నారు. వీరి వెంట రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, బోధన్ ఆర్డీఓ విజయ కుమారి, తహసీల్దార్లు శ్రవణ్, వెంకట రమణ, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

# మగ్గిడి గ్రామంలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన ర్యాలీ



ఆర్మూర్, బతుకమ్మ :ఆర్మూర్ మండలంలోని మగ్గిడి గ్రామంలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలల విద్య హక్కు పరిరక్షణ, బడిబయట ఉన్న పిల్లలను పాఠశాలలో చేర్పించే లక్ష్యంతో డ్రీమ్ స్వచ్ఛంద సంస్థ, అంతర్జాతీయ కార్మిక సంస్థ(ఐఎల్వో), చైల్డ్ లేబర్ ప్లాట్‌ఫారం(సీఎల్పీ)సంయుక్త ఆధ్వర్యంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీని గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించి,?బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని ప్రజలకు అవగాహన కల్పించారు. పిల్లలను పనుల్లోకి కాకుండా పాఠశాలల్లో చేర్పించి వారి విద్యాభ్యాసానికి ప్రతి కుటుంబం సహకరించాలని, బాలల హక్కులను పరిరక్షించేందుకు గ్రామస్థులందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పీఎంశ్రీ జడ్.పి. హెచ్.ఎస్ స్థానిక ప్రధానోపాధ్యాయురాలు హరిత, ఉపాధ్యాయులు, మగ్గిడి గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్, ఏఎన్ఎం,అంగన్‌వాడీ టీచర్, పాఠశాల విద్యార్థులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, గ్రామ ప్రజలు పాల్గొని ర్యాలీని విజయవంతం చేశారు.ఈ కార్యక్రమం సందర్భంగా బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, ప్రతి బాలుడికి విద్య హక్కు కల్పించడం,బాలల భవిష్యత్తును విద్య ద్వారానే నిర్మించవచ్చునే సందేశాలను ప్రజలకు విస్తృతంగా తెలియజేశారు. గ్రామస్థులు కూడా బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.డ్రీమ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు శ్రీశైలం మాట్లాడుతూ బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం గ్రామస్థాయిలో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూబడిబయట ఉన్న ప్రతి చిన్నారిని తిరిగి విద్యా ప్రవాహంలోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమానికి సహకరించిన గ్రామ ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, ?అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులకు సంస్థ తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

# సీపీఎం పార్టీ కార్యాలయంలో చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు




నిజామాబాద్ సిటీ, బతుకమ్మ :తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వీరనారి చిట్యాల ఐలమ్మ వర్ధంతి కార్యక్రమాన్ని నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సిపిఎం కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా చిట్యాల ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం జరిగిన కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం కేవలం హిందూ ముస్లింల మధ్య జరిగిన పోరాటం కాదని, బీజేపీ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలు తిప్పికొట్టాలని అన్నారు. నిజాం పాలనలోని భూస్వామ్య, జమీందారీ దోపిడీ,వెట్టి చాకిరీ, అక్రమ పన్నులు,రైతులపై సాగిన దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పేద రైతులు,వ్యవసాయ కూలీలు,సామాన్య ప్రజలు సాగించిన పోరాటమే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమని తెలిపారు. ఈ పోరాటంలో హిందువులు,ముస్లింలు సహా వివిధ వర్గాల ప్రజలు కలిసి దోపిడీకి వ్యతిరేకంగా పోరాడారని అన్నారు. చిట్యాల ఐలమ్మ ఒక పేద బహుజన మహిళగా భూస్వామ్య పెత్తనాన్ని ఎదిరించి, తన భూమి హక్కు కోసం పోరాడటమే కాకుండా వేలాది మంది పేదలకు ధైర్యాన్ని ఇచ్చారని రమేష్ బాబు తెలిపారు. ఐలమ్మ పోరాటాన్ని మతాల మధ్య ఘర్షణగా చిత్రీకరించడం ఆమె త్యాగాలను, తెలంగాణ రైతాంగ పోరాట చరిత్రను వక్రీకరించడమేనని అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్ది వెంకట్ రాములు, జిల్లా కమిటీ సభ్యులు విగ్నేష్, సురేష్,ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి సిర్ప లింగం, నగర నాయకులు అనసూయమ్మ, అనిత, ఉద్ధవ్, అబ్దుల్, శంషాద్దీన్, అంజయ్య, ఈవీఎల్ నారాయణ, గోపి,రాజు తదితరులు పాల్గొన్నారు.

# చంద్రాయన్ పల్లీ సర్పంచ్ ను పరామర్శించిన మాజీ మంత్రి



ఇందల్వాయి, బతుకమ్మ :ఇందల్వాయి మండలంలోని చంద్రాయన్ పల్లీ సర్పంచ్ ఆరేటి రఘు కుటుంబాన్ని మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు గురువారం పరామర్శించారు.ఇటీవలే ఆరేటి రఘు వాళ్ళ అమ్మ మాజీ సర్పంచ్ ఆరేటి బాలవ్వ అనారోగ్యం తో మృతి చెందగా విషయం తెలుసుకున్న మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని, ఆందోళన చెందవద్దని సర్పంచ్ ఆరేటి రఘు కు మండవ భరోసా ఇచ్చారు. చంద్రాయన్ పల్లీ గ్రామ అభివృద్ధి కోసం మాజీ సర్పంచ్ ఆరేటి బాలవ్వ ఎంతో తపించిపోయేవారని గుర్తు చేశారు. ఆయన వెంట మాజీ సింగిల్ విండో డైరెక్టర్ సంజీవ రెడ్డి,తదితరులు ఉన్నారు.

# బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మకు నివాళ్ళు



ఇందూర్, బతుకమ్మ : సాయుధ పోరాట యోధురాలు, బీసీల నిప్పు కణిక, ధీశాలి చాకలీ ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా వినాయక నగర్ లోని హనుమాన్ జంక్షన్ లో గల వీర నారి చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద బిసి సంక్షేమ సంఘం నాయకులు గురువారం ఘనంగా నివాళులు అర్పించారు. బీసీలు తిరగబడితే దేన్నైనా సాధించవచ్చని ఐలమ్మ చరిత్రే నిదర్శనమని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నరాల సుధాకర్ అన్నారు. ఇప్పటికైనా బీసీలు మేలుకొని తమను తాము పరిపాలించుకోవాలని, ఆ రోజు దేశ్ముఖ్ లను, రజాకార్లకు పరిగెత్తించిన ఐలమ్మ యొక్క తెగింపును వారసత్వంగా బీసీలు ఎంచుకుని ముందుకు సాగాలని బీసీ సంక్షేమ సంఘం పిలుపునిచ్చారు. ఒక్క వీరనారి కొన్ని వేల ఎకరాల భూమిని ప్రజలకు చెందే విధంగా చూడడం ఒక గొప్ప విషయమని, తన నాలుగు ఎకరాల భూమిని కాపాడుకోవ డమే కాకుండా వేల మందికి భూమి చెందే విధంగా చూసిన నాయకురాలు గొప్ప ధీశాలి చాకలి ఐలమ్మ అన్నారు. ఆమె చివరి శ్వాస వరకు కూడా బడుగు బలహీన వర్గాల కొరకు శ్రమించిందని, ఆమె బాటలో పయనించి బీసీలు తమ హక్కులను సాధించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నరాల సుధాకర్, కరిపే రవిందర్, కొయ్యడ శంకర్ బగలి అజయ్,శ్రీలత, కొట్టూర్ చంద్రకాంత్, రేఖ, దేశాయి గంగాధర్ సురేందర్ గూపనపల్లి, శంకర్, సాయిలు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# నాళేశ్వర్ గ్రామంలో డిజిటల్ క్రాప్ సర్వే



నవీపేట్, బతుకమ్మ : నాళేశ్వర గ్రామం లో నిర్వహిస్తున్న డిజిటల్ క్రాప్ సర్వే (డీసీఎస్) కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ ఆర్మూర్ లావణ్య శ్రీనివాస్, బినోల సొసైటీ చైర్మన్ మగ్గారి హన్మండ్లు వ్యవసాయ విస్తరణ అధికారి దుంప విజయ్ తో కలిసి క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా గ్రామం లోని సర్వే క్షేత్రాలను సందర్శించి, సర్వే ప్రక్రియను పరిశీలించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక వాలంటీర్‌ను కేటాయించి సర్వే నిర్వహిస్తుంది. డిజిటల్ క్రాప్ సర్వేలో ప్రతి సబ్‌డివిజన్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అందులో సాగు చేస్తున్న పంట, పంట రకం/వెరైటీ, సర్వే సమయంలో పంట దశ, విత్తిన తేదీ తదితర వివరాలను నమోదు చేస్తున్నారు. ఈ సందర్భంగా సర్వే వివరాలు ఖచ్చితంగా ఉండేలా క్షేత్రస్థాయిలో పంటలను ప్రత్యక్షంగా పరిశీలించి నమోదు చేయాలని వాలంటీర్లకు సూచించారు. అలాగే, డిజిటల్ క్రాప్ సర్వేను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. డీసీఎస్?త్వరగా పూర్తయితే పంటల వారీగా సాగు విస్తీర్ణంపై స్పష్టత ఏర్పడి, సంబంధిత కొనుగోలు సంస్థలు పంటల సేకరణను సులభంగా ప్రణాళిక చేసుకోవడానికి అవకాశం ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో రైతులు భూమయ్య, గణేష్ వాలంటరీ నవీన్ ఉన్నారు.

# సిర్నాపల్లి గ్రామంలో ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి



ఇందల్వాయి, బతుకమ్మ : ఇందల్వాయి మండలంలోని సిర్నాపల్లి గ్రామంలో చాకలి ఐలమ్మ వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహానికి సిర్నాపల్లి రజక సంఘం సభ్యులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. నిత్యం ప్రజల సంక్షేమం కోసం పోరాటం చేసినా వీరవనిత చాకలి ఐలమ్మ అని కొనియాడారు. ఆమె ఆశయ సాధన కోసం గ్రామ గ్రామాన ఉన్న రజక సంఘం సభ్యులు కృషి చేయాలని ఈ సందర్భంగా రజక సంఘం సభ్యులు పిలుపునిచ్చారు. ఆమె నాడు స్వాతంత్రం కోసం ప్రాణాలను సైతం లెక్క చేయలేదని ఆమె సేవలను కొనియాడారు.చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమానికి రజక సంఘం సభ్యులు అధ్యక్షత వహించగా గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, రజక సంఘం సభ్యులు పెద్ద మొత్తంలో పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని కొనసాగిద్దాం

### ఆర్ఎస్ పీ, ఎఐపీఎస్ యూ నాయకులు

### వీరనారి ఐలమ్మ విగ్రహానికి ఘన నివాళులు



ఇందూర్, బతుకమ్మ :నగరంలోని వినాయక్ నగర్‌లో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమాన్ని రెవల్యూషనరీ సోషలిస్టు పార్టీ, అఖిల భారత ప్రగతిశీల విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి కటారి రాములు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ చూపిన ధైర్యం, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా చేసిన పోరాటం ప్రజలకు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన త్యాగాలను నేటి తరాలు గుర్తు చేసుకోవాలని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం, సామాజిక న్యాయం కోసం చాకలి ఐలమ్మ ఆశయాలను కొనసాగిస్తూ పోరాటాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో డి. కృష్ణ, సునీల్, సూర్యపాల్, రంజిత్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## సౌమ్య నాయక్ తండాలో రక్షణ సమావేశం

### పాల్గొన్న వివిధ శాఖల అధికారులు



ఇందల్వాయి, బతుకమ్మ :ఇందల్వాయి మండలంలోని చంద్రన్ పల్లీ గ్రామ పంచాయతీ పరిధిలోని సామ్య నాయక్ తండాలో ఇందల్వాయి అటవీ రేంజ్ అధికారి రవి మోహన్ బట్ ఆధ్వర్యంలో రక్షణ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖలకు చెందిన అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇందల్వాయి ఆటవి రేంజ్ అధికారి రవి మోహన్ బట్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ప్రభుత్వ ఆదేశాలను తూచా తప్పకుండా పాటించాలన్నారు. అటవీ శాఖ అనుమతులు లేనిది అటవీ భూములలో ఎలాంటి చర్యలు తీసుకోవద్దని సూచించారు. అలాగే ఆటవి ప్రాంతంలోని చెట్లను నరికితే కఠిన చర్య తీసుకుంటామన్నారు. వేటగాళ్లు వన్యప్రాణులను సైతం వేటాడటం నేరమని ఆయన గుర్తు చేశారు, ఎంపీడీవో అనంతరావు మాట్లాడుతూ అటవీ భూములను అన్యాక్రాంతం చేయవద్దని హితవు పలికారు. అటవీ చట్టాన్ని ప్రతి ఒక్కరు గౌరవించాలన్నారు. కార్యక్రమంలో చంద్రన్ పల్లీ తోపాటు, సామ్య నాయక్ తండాకు చెందిన ప్రజలు, వివిధ శాఖలకు చెందిన సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఎఐకెఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా వేల్పూర్ భూమయ్య



నిజామాబాద్, బతుకమ్మ :రైతు పక్షపాతి, రైతాంగ సమస్యలపై నిరంతరం పోరాడే జిల్లా వాసి వేల్పూర్ భూమయ్య అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏఐకేఎంఎస్ 9వ రాష్ట్ర మహాసభలు మంచిర్యాల పట్టణ కేంద్రంలో జరిగిన సమావేశంలో వేల్పూర్ భూమయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అగ్గు ఎర్రన్న తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతు వ్యతిరేక విధానాలపై లోతైన చర్చ చేశామని ఆయన అన్నారు. కేంద్రంలోని ఆర్ఎస్ఎస్,బిజెపి ప్రభుత్వ ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వం వ్యవసాయ రంగంలో తీసుకువస్తున్న రైతు వ్యతిరేక చట్టాలు, అమెరికా యురేపియన్ తో చేసుకున్న స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలు మొత్తం వ్యవసాయరంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టుతున్నాయని అవి మరింత రైతాంగానికి ఉరితాళ్లుగా మారుతున్నాయని ఆయన అన్నారు. ఇలాంటి వ్యవసాయరంగ సంక్షోభం ఎదుర్కొంటున్న,తీవ్ర అప్పులో కూరుకుపోతున్న రైతును మరింతగా కుంగదీస్తున్నాయని ఆయన అన్నారు. రాబోయే రోజుల్లో రైతులందరిని ఐక్యపరచి బలమైన రైతు ఉద్యమాన్ని నిర్మించేందుకు తగిన కార్యచరణ చేపట్టుతున్నామని ఆయన అన్నారు. దేశ వనరులను, సంపదను, భూములను మోదీ ప్రభుత్వం కార్పొరేట్లకు కట్టబెడుతూ రైతును భూముల నుండి బేద కాల్ చేస్తుందని కార్మిక,ప్రజలను ఉపాధి నుండి దూరం చేస్తుందని విద్యార్థి యువకులను ఉపాధి కల్పించే కార్యక్రమాలు చేపట్టకుండా మత విద్వేషాలు రెచ్చగొట్టే కార్యక్రమాలను గురిచేస్తుందని ఎర్రన్న అన్నారు. ఈ నేపథ్యంలో ఏఐకేఎంఎస్ జాతీయ 4వ మహాసభను తెలంగాణ గడ్డమీదనే ఈనెల 29,30,31 తేదీలలో ఖమ్మం పట్టణంలో నిర్వహించబోతున్నామని వారన్నారు. రైతులను రక్షించుకుందాం వ్యవసాయాన్ని కాపాడుకుందాం కార్పొరేట్ చేతుల్లోకి వ్యవసారంగాన్ని కట్టబెట్టే మోదీ ప్రభుత్వ విధానాలను సమరశీల ఐక్య రైతు ఉద్యమల ద్వారా మాత్రమే తిప్పికొట్టగలమని వారన్నారు. అందుకు దేశవ్యాప్తంగా రైతులందరూ ఐక్య అవుతున్నారని ఆ వెలుగులో ఢిల్లీ తరహా రైతు ఉద్యమాలు వస్తాయని వారు తెలిపారు.

# నీటి వనరులు వృధా కాకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలి

### అధికారులతో సమీక్షలో ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి




నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :ఎల్ నినో ప్రభావంతో వర్షాభావం నెలకొని ఉన్న ప్రస్తుత తరుణంలో, అందుబాటులో ఉన్న నీటి వనరులు వృధా కాకుండా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో గురువారం కలెక్టర్ భవేష్ మిశ్రాతో కలిసి వివిధ శాఖల అధికారులతో ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి సమీక్ష జరిపారు. వివిధ జలాశయాలలో అందుబాటులో ఉన్న నీటి నిల్వల గురించి ఇరిగేషన్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గత ఏడాదితో పోలిస్తే శ్రీరాంసాగర్ సహా ఇతర ప్రాజెక్టులలో అతి తక్కువ నీటి నిల్వలు మాత్రమే అందుబాటులో ఉన్నాయన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఎక్కడ కూడా చుక్క నీరు సైతం వృధా కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. తాగునీటి అవసరాలకు నీటిని నిలువ ఉంచుతూ, పంటలను కాపాడేందుకు వీలుగా రెండు తడుల వరకు సాగు నీటిని విడుదల చేయాలని నిర్ణయించడం జరిగిందన్నారు. నిజాంసాగర్, శ్రీరాంసాగర్ జలాలు చివరి ఆయకట్టు వరకు చేరేలా గట్టి నిఘా ఉంచాలని, నెల రోజుల పాటు క్షేత్రస్థాయిలో సందర్శిస్తూ నీటి నిల్వలు వృధా కాకుండా చూడాలని సూచించారు. ఈ విషయంలో ఎవరైనా నిర్లక్ష్యానికి తావిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. రైతుల ప్రయోజనాలతో ముడిపడి ఉన్న అంశాలలో ఎంతమాత్రం రాజీ పడబోమని, నీటి వృధా జరిగి పంటలు ఎండితే సంబంధిత అధికారులను బాధ్యులుగా పరిగణిస్తామని తేల్చి చెప్పారు. నీటి వృధాను నిలువరించేందుకు అవసరమైన చోట కాలువలు, తూముల మరమ్మతులు వంటి పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని, ఈ పనులకు కావాల్సిన నిధులను సమకూరుస్తామని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. కాగా, వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో ఉంటూ రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని అన్నారు. ఖరీఫ్ పంట సేకరణకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు వీలుగా గోడౌన్ లలో నిలువ ఉన్న బియ్యం నిల్వలను నిర్దేశిత ప్రాంతాలకు వేగంగా తరలించాలని సూచించారు. ప్రభుత్వ విద్యా సంస్థలలో చదువుకుంటున్న బాలబాలికలకు ఏకరూప దుస్తులను త్వరితగతిన అందించాలని సూచించారు. విద్యార్థిని, విద్యార్థుల కొలతలకు అనుగుణంగా నాణ్యతతో యూనిఫాంలు కుట్టి అందించేలా స్వయం సహాయక సంఘాలకు బాధ్యతను అప్పగించడం జరిగిందని, వారు సకాలంలో దుస్తులు కుట్టి ఇచ్చేలా చూడాలన్నారు. సమీక్షా సమావేశంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, జిల్లా రెవెన్యూ అధికారిణి గీత, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్న, పౌర సరఫరాల శాఖ అధికారి అరవింద్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో జరిగే కేజీబీవీ మహాధర్నా ను జయప్రదం చేయండి.



మాక్లూర్, బతుకమ్మ : తెలంగాణ రాష్ట్రంలోని కేజీబీవీ లో పనిచేస్తున్న నాన్ టీచింగ్, వర్కర్ల వేతనాల పెంపు ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ యూనియన్ (టీయూసీఐ) ఆధ్వర్యంలో ఈనెల 11న హైదరాబాద్ లో ఇందిరాపార్క్ వద్ద జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని ప్రచార కరపత్రాలను మాక్లూర్ కేజీబీవీలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ మాట్లాడుతూ కేజీబీవీ నాన్ టీచింగ్, వర్కర్ల పట్ల ప్రభుత్వం తీవ్రమైన నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి కేజీబీవీ సిబ్బంది వేతనాలను సమీక్షించాలన్నారు. ఏళ్లుగా వీరికి వేతనాలు పెరగలేదని, పైగా పని భారం పెరిగిందన్నారు. సమస్యలు పరిష్కరించమని విన్నవిస్తే, అదనంగా నైట్ డ్యూటీలు వేశారని ఆరోపించారు. కేజీబీవీ ల పట్ల గత ప్రభుత్వం కంటే కక్షపూరితంగా వ్యవహరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడేళ్లుగా అధికారులను ప్రభుత్వాన్ని ప్రజాప్రతినిధులను కలిసి విన్నవిస్తూనే ఉన్నామని, ఇక పోరాటం తప్ప మరోమార్గం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి ప్రకటించిన కనీస వేతనాలనైనా తక్షణమే అమలు చేయాలన్నారు. అకౌంటెంట్, వర్కర్లకు నిబంధనలకు, జాబ్ చార్ట్ కు భిన్నంగా ఇటీవల కేటాయించిన నైట్ డ్యూటీలను రద్దు చేయాలన్నారు. వారానికి ఒకరోజు సెలవు చొప్పున వర్కర్లకు వీక్లీఆఫ్ అమలు చేయాలన్నారు. ఖాళీ పోస్టులు భర్తీచేసి పనిభారం తగ్గించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో అర్హతలు ఉన్న నాన్ టీచింగ్ సిబ్బందికి వెయిటేజీ ఇవ్వాలన్నారు. రిటైర్మెంట్ వయసును 65 సంవత్సరాలకు పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. పీఎఫ్ ఈఎస్ఐ అమలు చేసి ఉద్యోగ, ఆరోగ్యభద్రత కల్పించాలన్నారు. రేపు హైదరాబాద్ ఇందిరాపార్క్ లో జరిగే మహాధర్నాకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని కేజీబీవీల నాన్ టీచింగ్, వర్కర్లు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సుమలత, కేజీబీవీ సిబ్బంది కావ్య, పద్మ, ప్రేమ, లక్ష్మి, వాసుకి, భారతి, సంతోషి, గోదావరి తదితరులు పాల్గొన్నారు.

## డిజిటల్ పంటల సర్వే పై అవగాహన



మోర్తాడ్, బతుకమ్మ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన డిజిటల్ పంటల సర్వే కార్యక్రమంలో భాగంగా మోర్తాడ్ మండలం లోని అన్ని గ్రామాలలో గ్రామానికి ఒక వాలంటీర్ చొప్పున 9 మంది వాలంటీర్స్ క్షేత్రస్థాయిలో సర్వే నెంబర్ వారీగా పంటలను పరిశీలించి వివరాలను నమోదు చేస్తున్నట్లు వ్యవసాయ అధికారి హరీష్ కుమార్ తెలిపారు. డిజిటల్ పంటల సర్వే ద్వారా రైతులు సాగు చేస్తున్న పంటలకు సంబంధించిన ఖచ్చితమైన వివరాలు ప్రభుత్వ రికార్డుల్లో నమోదు అవుతాయని అధికారులు పేర్కొన్నారు. పంటల ఆధారంగా ప్రభుత్వ పథకాలు, వ్యవసాయ సేవలు, కొనుగోలు కేంద్రాలలో ఇతర ప్రయోజనాలను రైతులకు మరింత సమర్థవంతంగా అందించేందుకు ఈ సర్వే ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. రైతులు తమ పొలాల్లోకి వచ్చే సర్వే సిబ్బందికి అవసరమైన సమాచారం అందించి, డిజిటల్ పంటల సర్వేను విజయవంతం చేయడానికి సహకరించాలని వ్యవసాయ శాఖ అధికారులు కోరారు. కార్యక్రమంలో వాలంటీర్స్ అజయ్, గణేష్ రైతులు తదితరులు పాల్గొన్నారు.



## నేడు బీసీల ధర్మ పోరాట దీక్ష




నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : ఈ నెల 11న పులాంగ్ చౌరస్తాలోని గల అంబేడ్కర్ విగ్రహం వద్ద బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ధర్మదీక్ష కార్యక్రమం చేపడుతున్నామని జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ తెలిపారు. గురువారం నగరంలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపుమేరకు బీసీలను మోసం చేసే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని, నయవంచను వ్యతిరేకిస్తూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా, కేంద్రాల్లో.... "బీసీల ధర్మ పోరాట దీక్ష" చేపట్టనున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా జరిగే జాతి జనగణలో బీసీ కులగణన చేపడతామని కేంద్ర ప్రభుత్వం ఢిల్లీలో జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో 1-5- 2025 న నిర్ణయం తీసుకొని ప్రకటించిందని, కానీ ఇప్పుడు కులగణన శాస్త్రీయమైన పద్ధతిలో చేయకుండా, ఓబీసీ కుటుంబాలను లెక్కించకుండా, బీసీ కాలం లేకుండా, ప్రతి కులానికి ఒక యూనిక్ కోడ్ లేకుండా బీసీలకు అన్యాయం చేస్తుందని అన్నారు. రెండవసారి అప్పుడే జాతీయ జన గణన ఆగస్టు 17వ తేదీ నుండి ప్రారంభం మొదలుపెట్టిందన్నారు. కావున ఈ ధర్మ పోరాట దీక్షలో ప్రతి ఒక్క బీసీ బిడ్డ పాలొని విజయవంతం చేసి కేంద్ర ప్రభుత్వానికి బీసీల న్యాయమైన డిమాండ్ ను వినిపించాలని, కేంద్ర ప్రభుత్వం స్పందించే వరకు ఉద్యమాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో బుస్స ఆంజనేయులు, ఆకుల ప్రసాద్, కొయ్యాడ శంకర్, శ్రీలత, కొట్టూర్ చంద్రకాంత్, సాయి, బసవ, రేఖ, దేశాయి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు

# చాకలి ఐలమ్మ స్ఫూర్తితో తెలంగాణ పునర్నిర్మాణం

## రాష్ట్ర ఆగ్రోస్ ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజ్.

బాన్సువాడ బతుకమ్మ : బాన్సువాడ పట్టణంలో చాకలి ఐలమ్మ స్ఫూర్తితో తెలంగాణ పునర్నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర ఆగ్రోస్ ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజ్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ తెలంగాణను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తోందని తెలిపారు.చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం బాన్సువాడ పట్టణంలోని ఐలమ్మ విగ్రహానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డితో కలిసి కాసుల బాలరాజ్ పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.ఈ సందర్భంగా బాలరాజ్ మాట్లాడుతూ.. భూస్వామ్య, దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ అని కొనియాడారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ఆమె చూపిన ధైర్యం, తెగువ ప్రజల్లో పోరాట స్ఫూర్తిని నింపాయని అన్నారు. పేదలు, అణగారిన వర్గాల హక్కుల కోసం ఐలమ్మ చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని పేర్కొన్నారు.ఐలమ్మ ఆశయాలు, పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా





తీసుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయం, సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు సమాన అవకాశాలు కల్పిస్తూ రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

**ఎస్ఐఆర్ కేంద్రాన్ని పరిశీలించిన బాలరాజ్.**

అనంతరం బాన్సువాడ పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎస్ఐఆర్ నోటీసుల వివరాలు స్వీకరించే కేంద్రాన్ని కాసుల బాలరాజ్ అధికారులతో కలిసి పరిశీలించారు. కేంద్రంలో కొనసాగుతున్న ప్రక్రియ, ప్రజల నుంచి స్వీకరిస్తున్న వివరాలు, వారికి అందిస్తున్న సమాచారం తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎస్ఐఆర్ నోటీసులకు సంబంధించిన వివరాల స్వీకరణ ప్రక్రియను పారదర్శకంగా, సజావుగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ప్రజలకు అవసరమైన సమాచారం, మార్గదర్శకాలను అందుబాటులో ఉంచాలని కోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు ఖలేఖ్, ఎజాస్, వసంత, నందు, కోఆప్షన్ సభ్యులు ఖామర్ గౌస్,కామారెడ్డి జిల్లా యువజన అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, గోపాల్ రెడ్డి, తాడ్కోల్ సర్పంచ్ రమేష్, షాహబ్, రవీందర్, నియోజకవర్గ యువజన అధ్యక్షుడు మన్సూర్, నర్సన్నచారి, గౌస్, హన్మండ్లు, రజక సోదరులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వెంటనే నూతన సొంత భవనం నిర్మించాలి

## పీడీఎస్ యు ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన

నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : డిచ్ పల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వెంటనే నూతన సొంత భవనం నిర్మించి, విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్ యు ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టి అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ భుజంగ రావుకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్ యు జిల్లా నాయకులు ఎం. మున్నా కుమార్, తెలంగాణ యూనివర్సిటీ నాయకులు సంజయ్ మాట్లాడుతూ డిచ్ పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు సరైన మౌలిక వసతులు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.




కళాశాలకు సొంత భవనం లేకపోవడంతో విద్యార్థులు పరిమిత సౌకర్యాల మధ్య విద్యను అభ్యసించాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ప్రస్తుతం ఉన్న తరగతి గదులు అధ్వానస్థితిలో ఉన్నాయని, వర్షం వచ్చినప్పుడు పైకప్పు నుంచి నీరు కారడంతో పాటు రేకులు పగిలి ఉండటంతో వర్షపు నీరు తరగతి గదుల్లోకి వస్తోందన్నారు. విద్యుత్ సమస్యలు, చెత్తాచెదారం పేరుకుపోవడం వంటి సమస్యలు కూడా ఉన్నాయని తెలిపారు. తాగునీరు, మరుగుదొడ్లు, ప్రయోగశాలలు, సరైన తరగతి గదులు, ఫర్నిచర్ తదితర కనీస మౌలిక సదుపాయాలు కూడా పూర్తిస్థాయిలో అందుబాటులో లేవని పేర్కొన్నారు. కళాశాలకు నూతన సొంత భవనం నిర్మాణానికి అవసరమైన నిధులను వెంటనే మంజూరు చేసి నిర్మాణ పనులు ప్రారంభించాలని, అప్పటివరకు ప్రస్తుత తరగతి గదులకు తక్షణ మరమ్మతులు చేపట్టి విద్యార్థుల భద్రతను కాపాడాలని కోరారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి తక్షణమే స్పందించి, డిచ్ పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నూతన భవనం నిర్మించేలా ప్రభుత్వం, జిల్లా యంత్రాంగంపై ఒత్తిడి తీసుకువచ్చి అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించి డిచ్పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నూతన సొంత భవనం నిర్మాణ ప్రక్రియను ప్రారంభించకపోతే పీడీఎస్ యు ఆధ్వర్యంలో విద్యార్థులను కలుపుకొని ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పీడీఎస్ యు జిల్లా నాయకులు సృజన్, శ్రీశాంత్, అరవింద్,నితిన్,జీవన్,రాజు, రాజేష్,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మహత్యలపై మన దృక్పథాన్ని మార్చుకుందాం

## డీఎంహెచ్ వో డా.రాజశ్రీ

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా నగరంలోని గౌతంనగర్ లో ని పీహెచ్ సీ కేంద్రం వద్ద డీఎంహెచ్ వో రాజశ్రీ ఆధ్వర్యంలో ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవ అవగాహన ర్యాలీ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ వో రాజశ్రీ, జిల్లా మానసిక ఆరోగ్య అధికారి డా.రవి తేజలు ఆత్మహత్యలపై ఉన్న నిశ్శబ్దం, అపోహలను తొలగించి, సమస్యలపై బహిరంగంగా మాట్లాడేలా ప్రతి ఒక్కరినీ ప్రోత్సహించాలి. బాధలో ఉన్న వ్యక్తిని తీర్పు ఇవ్వకుండా, విమర్శించకుండా, సానుభూతితో వినడం ఎంతో ముఖ్యమైనదన్నారు. ఆత్మహత్యకు సంబంధించిన ఆలోచనలు, నిరాశ, ఒంటరితనం, తీవ్రమైన మానసిక ఒత్తిడి లేదా ప్రవర్తనలో ఆకస్మిక మార్పులు కనిపించినప్పుడు వాటిని తీవ్రంగా పరిగణించి, సకాలంలో సహాయం అందించాలని, మానసిక ఆరోగ్య సమస్యలు ఉన్నవారిని నిందించకూడదు, అవమానించకూడదు, వివక్ష చూపకూడదన్నారు. గర్భిణీ స్త్రీల మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని,తల్లి మానసిక ఆరోగ్యం మెరుగ్గా ఉంటే తల్లి పుట్టబోయే శిశువు ఆరోగ్యంపై సానుకూల ప్రభావం ఉంటుందన్నారు. అధిక ఒత్తిడి, ఆందోళన లేదా నిరాశ ఉన్నట్లయితే



కుటుంబ సభ్యులు సహకరించి, అవసరమైనప్పుడు మానసిక ఆరోగ్య నిపుణుల సలహా తీసుకునేలా చూడాలన్నారు. యుక్తవయస్కులు, యువతలో అధిక మొబైల్/సోషల్ మీడియా వినియోగాన్ని తగ్గించి, కుటుంబ సభ్యులు, స్నేహితులతో తమ భావాలు, సమస్యలను స్వేచ్ఛగా పంచుకునే వాతావరణాన్ని కల్పించాలన్నారు. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనలో వచ్చే మార్పులను గమనిస్తూ, వారిని మందలించడం కంటే వారితో మాట్లాడి, వినడం అర్థం చేసుకోవడం అలవాటు చేసుకోవాలన్నారు. కుటుంబాలు, స్నేహితులు, విద్యాసంస్థలు, కార్యాలయాలు, సమాజం మరియు ఆరోగ్య సంస్థలు కలిసి పనిచేస్తే ఆత్మహత్యల నివారణలో మరింత సమర్థవంతమైన ఫలితాలు సాధించవచ్చన్నారు. మానసిక ఆరోగ్య సహాయం కోసం టెలీ మానస్ టోల్-ఫ్రీ నంబర్: 14416 ను ఉపయోగించుకోవాలని ప్రజలకు తెలియజేయాలని, ఈ సేవ 24/7 అందుబాటులో ఉంటుందన్నారు. ఆరోగ్య సిబ్బంది తమ పరిధిలోని ప్రజలకు మానసిక ఆరోగ్యం, ఒత్తిడి నిర్వహణ, ఆత్మహత్యల నివారణ , సకాలంలో సహాయం పొందడం గురించి నిరంతరం అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా టెలిమానస్ 114416 కరపత్రాలను డిఎంహెచ్వో చేతులమీదుగా ఆవిష్కరించారు. ఆత్మహత్యల నివారణపై వైద్య సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ వో సికిందర్ నాయక్, పీవోఎన్ సీడీ వెంకన్న, డీవోఎంసీహెచ్ శిరీష, కావ్య, రూప, భాగ్యశ్రీ, తదితరులున్నారు.

## డాక్టర్ రామావత్ లాల్‌సింగ్‌కు ఘన సన్మానం



చందూర్, బతుకమ్మ :చందూర్ మండలం కారేగాం తండా సర్పంచ్ డాక్టర్ రామావత్ లాల్‌సింగ్ పి.హెచ్.డి డాక్టరేట్ పొందడంతో మండల కేంద్రంలో మాజీ డిసిసిబి అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి లాల్‌సింగ్‌ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతం నుంచి కష్టపడి ఉన్నత విద్యను అభ్యసించి డాక్టరేట్ సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు డా.కడాక్టర్ కూనిపూర్ రాజారెడ్డి, మాజీ సర్పంచ్ సాయి రెడ్డి, చందూర్ సొసైటీ చైర్మన్ అశోక్, సర్పంచులు రవి, ఉమారాణి, సంజీవ్, కృష్ణ, రవి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శ్రీనివాస్ లు డాక్టర్ రామావత్ లాల్‌సింగ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా చాకలి ఐలమ్మ 41 వ వర్ధంతి వేడుకలు..



రుద్రూర్, బతుకమ్మ : తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ 41 వర్ధంతి వేడుకలను రుద్రూర్ మండల కేంద్రంలోని రజక సంఘంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ శఇందూర్ సునీత చంద్ర శేఖర్ చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమం లో ఉప సర్పంచ్ షేక్ నిస్సార్, వార్డ్ మెంబెర్ విమల గౌడ్, దుర్కి రవి రజక సంఘం అధ్యక్షులు బందెల శేఖర్, మాజీ అధ్యక్షుడు నర్సింలు, వీరాపురం సాయిలు, జయరాం, ఎల్లగారి నరేందర్, నరేందర్, అంబం సాయిలు, బాబి సాయిలు, బీమయ్య, శంకర్, మహిళలు తదితరులు పాల్గొనారు.

## విప్లవ కెరటం చిట్యాల ఐలమ్మ ...



రుద్రూర్, బతుకమ్మ న్యూస్ : భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం సాయిధ పోరాటం కొనసాగించిన విప్లవ కెరటం చిట్యాల ఐలమ్మ అని సీపీఎం ఏరియా కార్యదర్శి నన్నేసాబ్ అన్నారు. గురువారం రుద్రూర్ మండల కేంద్రంలో చిట్యాల ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళి అర్పించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని మతోన్మాదులు హిందూ ముస్లీం ఘర్షణగా చిత్రీకరించి, చరిత్రను వక్రీకరిస్తున్నారని తద్వారా రాజకీయ లబ్ధి కోసం పాకులాడుతున్నారని మండిపడ్డారు. తెలంగాణ సాయుధ పోరాట చరిత్ర తెలంగాణ సమాజానికి తెలుసని, మతోన్మాదుల కుట్రలను తెలంగాణ ప్రజలు తిప్పికొడతారని హెచ్చరించారు. చిట్యాల ఐలమ్మ పోరాట స్ఫూర్తితో పేద ప్రజలందరూ ఐక్యంగా తమ హక్కుల కోసం పోరాడాలని నన్నేసాబ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ మండల నాయకులు లక్ష్మణ్, భీమయ్య, మహబూబ్, సాయిలు, భూమయ్య, పీరయ్య, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## నిజాంసాగర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ రాజేష్



నిజాంసాగర్, బతుకమ్మ : కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ పోలీస్ స్టేషన్ ను కామారెడ్డి ఎస్పీ రాజేష్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ లోని ఫైళ్ళను, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన బాధ్యత అని, ప్రతి ఫిర్యాదుపై సత్వర స్పందన, బాధితులకు న్యాయం చేయాలన్నారు. ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేయాలని, బీట్, పెట్రోలింగ్ బలోపేతంతో విజిబుల్ పోలీసింగ్ ను పర్యవేక్షించాలని సూచించారు. సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించాలని, గణేష్ ఉత్సవాలకు ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి భద్రతకు భరోసాగా నిలవాలని సిబ్బందికి సూచించారు.



## కెసిఆర్ ఫామ్ హౌస్ రోడ్లను శుద్ధి చేసిన వారిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయాలి...

భిక్కనూరు,బతుకమ్మ : మాజీ సీఎం కల్వకుంట్ల చంద్ర శేఖర్ రావు ఫామ్ హౌజ్ పరిసరాలను రోడ్లను పసుపుతో, పాలతో శుద్ధి చేసిన బీఆర్ఎస్ నాయకులు పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ భిక్కనూరు పోలీసులకు గురువారం దళిత సంఘాల నాయకులు ఫిర్యాదు చేశారు. భిక్కనూరు పోలీస్ స్టేషన్ ఆవరణలో వారు మాట్లాడుతూ స్పీకర్ గడ్డం ప్రసాద్ పైన అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేసీఆర్ ఫామ్ హౌస్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని, ఈ కార్యక్రమానికి దళితులు వచ్చారన్న ఉద్దేశంతో తమ మనోభావాలు దెబ్బతినేలా కొందరు బిఆర్ఎస్ నాయకులు కేసీఆర్ ఫామ్ హౌస్ పరిసరాలతో పాటుగా రోడ్లను పాలతో పసుపుతో శుద్ధిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా చేయడం దళితుల మనోభావాలను దెబ్బతీయటమేనని ఈ ఘటనపై విచారణ చేసి బాధ్యులపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పొట్టి గిని శంకర్, మండల అధ్యక్షుడు తుడుం జీవన్, నాయకులు పాల్గొన్నారు.



## రుద్రూర్‌లో ఘనంగా ఎడ్ల పొలాల అమావాస్య..



రుద్రూర్, బతుకమ్మ : అన్నదాతకు సాగులో తోడుండే మూగజీవాలను కొలిచే పొలాల అమావాస్యను గురువారం రుద్రూర్ మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. పూల దండలు, గజ్జెలు, కొత్త కన్నాలతో ముస్తాబు చేసిన బసవన్నలకు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలను సమర్పించారు. హనుమాన్ దేవాలయాల్లో ఎడ్లతో ప్రదక్షిణలు చేయించి మొక్కులు చెల్లించుకున్నారు. బసవన్నలు ఏడాది పొడవున పడిన కష్టాలపై పొలాల రోజున సాంబశివుడి వద్ద గోడు వెల్లబోసు కుంటాయని రైతుల నమ్మకం. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలి.

### ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి






భీమ్ గల్, బతుకమ్మ :గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించుకోవాలని ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి కోరారు. వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని భీమ్ గల్ పట్టణంలోని లోని సహస్ర కన్వెన్షన్ హాల్‌లో గురువారం శాంతి కమిటి నిర్వహించారు. ఈ సమావేశానికి ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారై మాట్లాడారు. వినాయక మండపాల నిర్వాహకులు పోలీసుల సూచనలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఉత్సవాల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడవద్దని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. మండపాల వద్ద విద్యుత్ భద్రత, అగ్నిప్రమాదాల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.
మండపాల ఏర్పాటుకు సంబంధించి అవసరమైన అనుమతులు తీసుకోవాలని, రహదారులకు ఇబ్బంది కలిగించకుండా మండపాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు . ఉత్సవాల్లో డీజేలకు అనుమతి లేదని, అధిక శబ్దంతో ప్రజలకు ఇబ్బంది కలిగించకుండా నిబంధనలకు అనుగుణంగా సౌండ్ సిస్టమ్ వినియోగించాలని స్పష్టం చేశారు. వినాయక నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసుల సూచనల మేరకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని, నిమజ్జన ఊరేగింపులో యువత సంయమనం పాటించాలని అధికారులు సూచించారు. సోషల్ మీడియాలో వివాదాస్పద పోస్టులు, వదంతులను ప్రచారం చేయవద్దని, అనుమానాస్పద విషయాలు కనిపిస్తే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు.
ఈ సమావేశంలో సీఐ పొన్నం సత్యనారాయణ గౌడ్, ఎస్సైలు సిహెచ్. తిరుపతి, శంకర్ తదితరులు పాల్గొని ఉత్సవాల నిర్వహణకు సంబంధించిన భద్రతా చర్యలు, పోలీసుల సూచనలు వివరించారు. వినాయక మండపాల నిర్వాహకులు, సర్వసమాజ్ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, యువకులు, తహసీల్దార్ కిరణ్ కుమార్, ఎంపీడీఓ గంగుల సంతోష్ కుమార్, మున్సిపల్ కమీషనర్ గజానంద్, మున్సిపల్ చైర్మన్ బోదిరే నాగమణి, బోదిరే స్వామి, వైస్ చైర్మన్ సంటి లత, జేజే నర్సయ్య, మోర్తాడ్ ఎస్సై రాము, వేల్పూర్ ఎస్సై సంజీవ్, ఎర్గట్ల ఎస్సై రాజేశ్వర్, కమ్మర్ పల్లి ఎస్సై సతీష్ ఏ ఎస్సై అబ్దుల్ సత్తార్, ట్రాన్స్ కో ఏఈ సత్యప్రసాద్, మున్సిపల్ కౌన్సిలర్లు తోట సతీష్, అంజుమ్, బోదిరే లావణ్య, (నర్సయ్య), మల్లెల అనుపమ ( ప్రసాద్ ), సంగ్యా నాయక్, నీలం రవి, సందీప్, పర్స కుశలత, గున్నాల లక్ష్మి, సర్వ సమాజ్ కమిటీ అధ్యక్షులు పఠాని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పొలాల అమావాస్యకు పల్లె పండుగ శోభ

### బసవన్నలకు ప్రత్యేక పూజలు. సంప్రదాయబద్ధంగా వేడుకలు





మద్నూర్ బతుకమ్మ :సెప్టెంబర్ 10 మద్నూర్ ఉమ్మడి మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో పొలాల అమావాస్య పండుగను రైతులు, గ్రామీణ ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పల్లె సంప్రదాయాలు, వ్యవసాయ సంస్కృతికి ప్రతీకగా నిలిచే ఈ పండుగ సందర్భంగా గ్రామాల్లో సందడి నెలకొంది.పొలాల అమావాస్య సందర్భంగా రైతులు తమ వ్యవసాయానికి అండగా నిలిచే బసవన్నలను ప్రత్యేకంగా అలంకరించి పూజించడం ఆనవాయితీగా వస్తోంది. ఉదయాన్నే బసవన్నలను గ్రామంలోని ఊర చెరువుకు తీసుకెళ్లి స్నానం చేయించి, అనంతరం బెల్లం, తొక్కుడి పానకం, మంచి నూనె తదితర సంప్రదాయ పద్ధతుల్లో ఆచారాలను నిర్వహించారు.అనంతరం బసవన్నలను రంగురంగుల అలంకరణలతో ముస్తాబు చేసి, మెడలో గంటలు, తలకు బాసింగాలు కట్టి ప్రత్యేక ఆకర్షణగా తీర్చిదిద్దారు. గ్రామంలోని హనుమాన్ మందిరం చుట్టూ బసవన్నలను తిప్పి ప్రత్యేక పూజలు నిర్వహించి, తిరిగి ఇంటికి తీసుకెళ్లారు.ఇళ్ల వద్ద బసవన్నలకు, గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి పెళ్లి వేడుకను సంప్రదాయబద్ధంగా జరిపారు.పంటలు సమృద్ధిగా పండాలని, రైతు కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని గ్రామస్తులు ప్రార్థించారు. పొలాల అమావాస్య సందర్భంగా గ్రామాల్లో చిన్నా, పెద్దా తేడా లేకుండా ప్రజలు ఉత్సాహంగా పాల్గొనడంతో పల్లెల్లో పండుగ వాతావరణం నెలకొంది. రైతు జీవన విధానానికి, పశుసంపదకు ఉన్న అనుబంధాన్ని చాటిచెప్పే ఈ సంప్రదాయ పండుగను గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు తరతరాలుగా కొనసాగిస్తున్నారు.

# రోగులకు పండ్ల పంపిణీ

### ఘనంగా డా. ఏలేటి మల్లికార్జున్ రెడ్డి జన్మదిన వేడుకలు



భీమ్‌గల్,బతుకమ్మ:బాల్కొండ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ డాక్టర్ ఏలేటి మల్లికార్జున్ రెడ్డి జన్మదిన వేడుకలను బీజేపీ భీమ్‌గల్ మండల పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.
గురువారం నిర్వహించిన ఈ జన్మదిన వేడుకలను కేవలం ఆర్భాటాలకు పరిమితం చేయకుండా సేవా కార్యక్రమాలకు వేదికగా మార్చుతూ, భీమ్‌గల్ పట్టణంలోని వివిధ ఆసుపత్రులను బీజేపీ నాయకులు, కార్యకర్తలు సందర్శించారు. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేసి, వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ భీమ్‌గల్ మండల పార్టీ అధ్యక్షులు ఆరే రవీందర్ మాట్లాడుతూ, “డాక్టర్ ఏలేటి మల్లికార్జున్ రెడ్డి రాజకీయ ప్రస్థానం పదవుల కోసం కాదని, ప్రజా సేవ కోసం, పేదల కష్టాల్లో అండగా నిలవడం, కార్యకర్తల సమస్యల్లో తోడుగా ఉండడం, నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం పోరాడడం ఆయన ప్రత్యేకత” అని అన్నారు.
బాల్కొండ నియోజకవర్గంలో బీజేపీని బలోపేతం చేయడంలో డాక్టర్ ఏలేటి మల్లికార్జున్ రెడ్డి పాత్ర ఎంతో కీలకమన్నారు .
ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావించే నాయకుడి జన్మదినాన్ని రోగులకు పండ్లు పంపిణీ చేసి, సేవా కార్యక్రమంతో జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.
డాక్టర్ ఏలేటి మల్లికార్జున్ రెడ్డి కి ఆ భగవంతుడు సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించి, మరెన్నో సంవత్సరాలు ప్రజలకు సేవ చేసే శక్తిని అందించాలని, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో స్టేట్ కౌన్సిల్ మెంబర్ యోగేశ్వర నరసయ్య, ముచ్కూరు సర్పంచ్ కోడిగేల శ్రీనివాస్, కుప్కల్ సర్పంచ్ నర్సింగరావు, ఉప సర్పంచ్ ప్యాట్ల రాజేష్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు తోట గంగాధర్, బీజేవైఎం అధ్యక్షులు ప్రేమ్ చంద్, మండల ప్రధాన కార్యదర్శి పల్లికొండ ప్రసాద్,ఉపాధ్యక్షులు గొపరి లక్ష్మీనారాయణ,సీనియర్ నాయకులు కొట్టాల అశోక్, బద్దం సంజయ్, ధర్పల్లి మహిపాల్, రాజ్ కుమార్, శ్రీనివాస్ గౌడ్, మండల పదాధికారులు, కార్యకర్తలు, యువ నాయకులు తదితరులు పాల్గొన్నారు.